క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆశావర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్

హనుమంతునిపాడు: సీజినల్ వ్యాధులు సోకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సందీప్ కుమార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశావర్లడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యసిబ్బంది హెల్త్ క్లీనిక్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధులు సోకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సలహాలు సూచలివ్వాలన్నారు. కుష్టు, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి వివరాలు తీసుకోవాలన్నారు.

జయలక్ష్మికి అభినందనలు



ఎం జయలక్ష్మిని అభినందిస్తున్న యూనివర్శిటీ అధికారులు

కనిగిరిరూరల్: డిగ్రీ బీఎస్సీ జువాలజీ పరీక్ష ఫలితాల్లో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వైష్టవి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం జయలక్ష్మిని మంగళవారం యూనివర్శిటీ అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ పీపీఎస్ మూర్తి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. యూనివర్శిటీ ఓఎస్‌డీ కేవీఎస్ రాజు, కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మీ, ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన పెద నరసింహం

పొన్నలూరు: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పొన్నలూరు చెరువు నాగిరెడ్డిపాలెం మధ్యలో ఓవీ రోడ్డుపై మంగళవారం జరిగింది. బాధితుల వివరాల ప్రకారం..నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సిరిగిరి పెద నరసింహం పొలం దగ్గరకు వెళ్లి పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో పొన్నలూరు చెరువు దాటిన తరువాత కందుకూరు నుంచి కనిగిరి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో పెద నరసింహం రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో చికిత్స కోసం స్థానికులు 108కు సమాచారం అందించడంతో వారు వచ్చి కందుకూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించినట్లు సమాచారం.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుంటాం



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ వెంచర్లపై, నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల్లో వేసిన వెంచర్లపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక చైర్మన్ ఛాంబర్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అక్రమ వెంచర్లు వేసిన భూములపై తక్షణ చర్యలకు రెవెన్యూ శాఖకు నివేదికలు ఇచ్చామన్నారు. అనధికార, అక్రమ వెంచర్లతో మున్సిపల్ ఆదాయంకు గండి పడుతున్నట్లు తెలిపారు. అంతేగాక అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారు... ఇళ్లు నిర్మించుకునేందుకు ఎటువంటి అర్హతలు, అనుమతులు రాక భవిష్యత్‌లో ఇక్కట్లకు గురికావాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల అమాయక ప్రజలు బలవుతారని వివరించారు. అక్రమ వెంచర్లలో ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేయవద్దని సూచించారు. పట్టణంలోని అక్రమ వెంచర్లను గుర్తించి తక్షణం నివేదిక ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించినట్లు చైర్మన్ వెల్లడించారు.

6న మండల స్థాయి సమావేశం

కొండపి: బీసీ కార్పొరేషన్, ఆదరణ–3 పథకానికి సంబంధించి ఈ నెల 6న స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కులవృత్తి సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా ఆధునిక పనిముట్లు వాటి నాణ్యత కంపెనీలు, ఏజెన్సీ వివరాల సేకరించేందుకు కోసం కులవృత్తి సంఘాలతో మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా హాజరు కావాలన్నారు.

గ్రాసానికి గడ్డుకాలం

- మండుతున్న వరిగడ్డి రేట్లు
- ట్రక్కు వరిగడ్డి రూ.14 నుంచి రూ.18 వేల పైనే
- ఏడాదిలో రూ.6 వేలు పెరిగిన వైనం
- పాడి రైతులకు తప్పని కష్టాలు



వరిగడ్డిని ట్రాక్టర్లో కొనుక్కుని తోలుకెళ్తున్న రైతులు

పీసీపల్లి:

పశుగ్రాసం కొరతతో పాడి రైతులు పరేషాన్ అవుతున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పశుగ్రాసం కొరత కారణంగా ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పెరిగిన ధరలతో పశుగ్రాసం కొనుగోలు చేయలేక పశువులను పెంచడానికి రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కాలువలు, డ్యాంలు లేకపోవడంతో వర్షాలపై ఆధారపడి బోర్లు, బావుల కింద పంటలు సాగు చేస్తారు. ఏటా వివిధ రకాలైన గ్రాసం పైర్లను సాగుచేసేవారు. కానీ ఏడాది ఆ పరిస్థితి లేదు. దీంతో గ్రాసం కొరత ఏర్పడి పశుపోషకులు కటకటలాడుతున్నారు. మండలంలోని తెల్లజాతి పశువులు 2000, గేదెలు 26,800 వరకు ఉన్నాయి. ప్రస్తుతం వేసవి కావడంతో పచ్చిక దొరక పశుపోషకులు అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో ఎండు గడ్డి సైతం ధరలు విపరీతంగా పెరిగింది. దీంతో మూగజీవాలు పోషణ భారంగా మారడంతో అధిక శాతం మంది పశువుల్లో గ్రాసం కొనలేక పశువులను తెగనమ్ముకుంటున్నారు.

ట్రక్కు రూ.18 వేలకు పైనే

ఈ ఏడాది గ్రాసం ధర ఆకాశాన్ని అంటుతోంది. గత ఏడాది రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలకగా ఈ ఏడాది ట్రక్కు వరి గడ్డి రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు పలుకుతోంది. దీనికి తోడు టక్కు వేసినందుకు రూ.3 వేలకు అదనంగా అవుతోంది. రైతు ఎండుగడ్డిని కొనాలంటే పాడి రైతులు జంకుతున్నారు. ప్రస్తుతం పాల ధరలు తక్కువగా ఉండటం, గ్రాసం దొరక్కపోవడం, దొరికినా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడంతో పశుపోషకులు పశువులను తెగనమ్ముకొని వదిలించుకునే పరిస్థితులు నెలకొన్నాయి.

మూలనపడిన ప్రభుత్వ పథకాలు

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పశుగ్రాసం సమస్యను అధిగమించి రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకంలో పశుగ్రాసం పెంపకాన్ని ప్రవేశపెట్టి పశు పోషకులను ప్రోత్సహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సైతం పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు రాయితీపై విత్తనాలను పంపిణీ చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అవేమీ పట్టించుకోకపోవడంతో పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు.

గడ్డి కొనలేక గేదెలను అమ్మేశా:



నాకు ఆరు గేదెలు ఉండేవి. గడ్డి ధరలు బాగా పెరిగాయి. దీనికి తోడు పచ్చి గడ్డి లేక, వరిగడ్డి కొనలేక కొన్నింటినీ అమ్మేశాం. మిగిలిన వాటిని ఎలాగోలా గ్రాసం అందిస్తున్నాను.

మూల రామచంద్రారెడ్డి

గ్రాసం దొరకడం లేదు:



పశుగ్రాసం దొరకడం కష్టంగా ఉంది. వేసవిలో గడ్డి లేకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో గొర్రెలను అమ్మేశా.. రెండు గేదెలు మాత్రమే ఉంచుకొని జీవనం సాగిస్తున్నాం.

నల్లగంగుల శ్రీనివాస యాదవ్

మాలకొండయ్య మృతి పార్టీకి తీరని లోటు



పెద్దమాలకొండయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నేతలు

సీఎస్‌పురం(పామూరు): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రేగలగడ్డ పెద్ద మాలకొండయ్య మృతి పార్టీకి తీరని లోటని దద్దాల పెద్ద మాలకొండయ్య, పార్టీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మిత్తికాల గురవయ్యలు అన్నారు. మండలంలోని డీజీపేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు రేగలగడ్డ పెద్ద మాలకొండయ్య(78) అనారోగ్యంతో సోమవారం మృతిచెందగా మంగళవారం పార్టీ నాయకులు మృతుని నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్ బొట్లా చిరంజీవి, మేకల బాలుయాదవ్, పి.ఆదినారాయణ, సీహెచ్.శ్రీనివాసులు, యం.అటేలయ్య, బి.మాలకొండయ్య, లక్ష్మిరెడ్డి, కృపావరం, ఆర్.పెద్దనరసింహులు, సీహెచ్.తిరుపతయ్య, మితికల వెంకట్, ఈర్ల శ్రీను, కే.కేశవ, మోటు పలువురు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాకే పనులు ప్రారంభించాలి

- ప్రజా సంఘాల డిమాండ్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు, బాధితులు

కనిగిరిరూరల్: నడికుడి– శ్రీకాళహస్తి రైల్వే మార్గంలోని పేరంగుడిపల్లి వద్ద గల రైల్వే నిర్వాసిత బాధితులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతనే పనులు చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం చేశారు. సుమారు 25 ఏళ్ల నుంచి పట్టాలు పొంది, రూ లక్షలు పెట్టి పక్కా గృహాలు నిర్మించుకుని జీవిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి కనీసం పరిహారం ఇవ్వకుండా వెంటనే ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని బెదిరించడం సరైంది కాదన్నారు. సుమారు 14 ఏళ్లుగా బాధితులు పరిహారం నగదు కోసం రెవెన్యూ, రైల్వే అధికారులు చుట్టూ తిరుగుతున్నా.. కనీస స్పందన లేకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రైల్వే లైన్ కోసం తీసిన గుంతల్లో పడి ఇద్దరు విద్యార్థులు కూడా చనిపోయారని.. బాధితులు రెవిన్యూ అధికారులకు గుర్తు చేశారు. రైల్వే లైన్ నిర్మాణానికి వారు అటంకం కాదని.. తగిన పరిహారం చెల్లించి పనులు చేసుకోవాలని బాధితులు విన్నవిస్తున్నట్లు తెలిపారు. పరిహారం వచ్చేంత వరకు రైల్వే నిర్వాసితుల జోలికి వెళ్ల వద్దంటూ ప్రజా సంఘాల నేతలు గట్టిగా వాదించారు. దానికి వ్యతిరేకంగా.. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే.. ఏదైనా జరిగితే దానికి రెవెన్యూ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో స్పందించిన తహసీల్దార్ సమస్య తీవ్రతను ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పీవీ శేషయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జీపీ రామారావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ పవన్ కళ్యాణ్, బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు టి.తిరుపతిరావు, ఇండ్లా మాలకొండరాయుడు, అంబటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను సత్కరిస్తున్న తాడికొండ రామచంద్రరావు

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన తాడికొండ రామచంద్రరావు మంగళవారం పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను ఘనంగా సత్కరించారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో డాక్టర్ సురేష్‌ను కలిసిన రామచంద్రరావు తనపై నమ్మకం ఉంచి పార్టీలో రాష్ట్రస్థాయి పదవి వరించటానికి కారకులైనందుకు సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులను ఏ విధంగా మోసం చేస్తుందో ప్రజలకు వివరించే ప్రయత్నం చేసి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు కొమ్మాలపాటి మధు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మారంరెడ్డి గంగాధరరెడ్డి, నియోజకవర్గ కల్చరల్ విభాగం అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, పచ్చవ సర్పంచ్ కృష్ణ, సీనియర్ నాయకుడు బొక్కిసం సుబ్బారావు, చుండూరి సురేష్, కాకి జయపాల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ నాయకులు

కనిగిరిరూరల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతల ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా పోతల ప్రభాకర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌గా ఉన్నప్పుడు విధుల్లో చేరి పనిచేస్తున్న అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులను రెండు రాష్ట్రలుగా విభజన జరిగిన తర్వాత వారి సొంత రాష్ట్రాలకు బదిలీ చేశారని గుర్తు చేశారు. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హోంగార్డులను మాత్రం సొంత రాష్ట్రాలకు బదిలీ చేయలేదన్నారు. రాష్ట్ర విభజనలు జరిగి 11 ఏళ్లు కావస్తున్నా.. హోంగార్డులు అనేక సార్లు విన్నవించినా.. పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హోంగార్డుల బదిలీలకు చర్యలు చేపట్టాలని కోరారు. ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ నాయకులు పుట్టా సుబ్బారావు, మాచపల్లి పూర్ణ చంద్రరాజు, సీహెచ్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న జీవీ కొండారెడ్డి

కనిగిరిరూరల్: ఎన్నికల హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవి కొండారెడ్డి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రెండు బడ్జెట్‌లలో జిల్లా అభివృద్ధిపై పథకాల ప్రస్తావన లేదన్నారు. జిల్లాకు జరిగిన అన్యాయాన్ని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నిమ్జ్, నడికుడి- శ్రీకాళహస్తీ, ఒంగోలు ఎయిర్ పోర్ట్, వెలిగొండ ప్రాజెక్టు, ఆంధ్రకేసరి యూనివర్శిటీ అభివృద్ధిపై స్పష్టత లేకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో మంచినీటి పథకాలు మంజూరైనా.. అరకొర నిధుల కేటాయింపు చేశారన్నారు. ఆక్వా కల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఊసేలేదన్నారు. ట్రిపుల్ ఐటీ కళాశాల ఎక్కడ నిర్మిస్తారనేది స్పష్టత లేకపోవడం, మార్కాపురం మెడికల్ కాలేజీ నిలిపివేయడం, ఈఎస్ఐ హాస్పిటల్ ప్రస్తావన లేకపోవడం, దురదృష్టకరమన్నారు. పాలేటిపల్లి రిజర్వాయర్‌కు రూ.7కోట్లు అవసరం కాగా.. కేవలం రూ.10లక్షలే కేటాయించారన్నారు. ప్రాజెక్టుల పట్ల చంద్రబాబు చిన్న చూపు చూడటాన్ని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పీసీ కేశవరావు, బడుగు వెంకటేశ్వర్లు, రాయల మాలకొండయ్య, పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీకి సిద్ధం



వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని వివరిస్తున్న ఆర్పీలు

పామూరు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు, ఈమేరకు పనులు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్‌డి జీవీ రవిందారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ స్థానిక చెత్త నుంచి సంపద తయారీకేంద్రంలో త్వరలో డివిజన్ పరిదిలోని అన్ని మండలాల హరితరాయబారులు, ఎంపీడీఓలు, విస్తరణాదికారులు, పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారులు, ఇంజినీరింగ్ సహాయకులకు ఇంటింటి నుంచి చెత్త సేకరణ ఆవశ్యకత, రెండవదశ చెత్త విభజన గురించి, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా ఆర్పీలు ఐ.రాఘవరావు, పి.చక్రధర్‌రావు, జి.సురేష్‌బాబులు శిక్షణా కార్యక్రమాలకు అనువైన పరిసరాలు, సామగ్రి వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో రత్నకుమార్, క్లాప్‌మిత్రులు ఉన్నారు.


నేడు మండల అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం

కొండపి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం మండల అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి పాల్గొంటారన్నారు. సమావేశానికి మండల లెవల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఏపీఎం, సీసీలు, ఏపీఓ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సీసీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలు పరిశీలించిన ఆర్డీఓ

సింగరాయకొండ: మండలంలోని ప్రభుత్వ స్థలాలను మంగళవారం ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న పరిశీలించారు. పాతసింగరాయకొండ పంచాయతీలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ సమీపంలో జ్యోతిరావ్ పూలే బీసీ వసతి గృహం నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు ఆటస్థలానికి అవసరమైన రైల్వే స్థలాన్ని పరిశీలించారు. సోమరాజుపల్లి పంచాయతీలో వ్యవసాయ భూమిని కన్వర్షన్ కోసం పరిశీలించారు. తహశీల్దార్ టి.రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలు సకాలంలో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ

పీసీపల్లి: మండలంలో జరుగుతున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న పీ–4 సర్వే, వర్క్ ఫ్రం హోం, చిల్డ్రన్ ఆధార్ నమోదుపై సూచనలు చేశారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకునేలా అప్రమత్తం చేయాలని సూచించారు. ఈఓ ఆర్డీ మల్లేశ్వరి, సిబ్బంది ఉన్నారు

బ్యాంకు సిబ్బంది ఎక్కడ?



కెనరాబ్యాంకు లో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండల కేంద్రంలోని కెనరా బ్యాంకులో మంగళవారం మధ్యాహ్నం పనివేళల్లో సిబ్బంది ఎవరు లేక కుర్చీలు ఖాళీగా ఉండటం పట్ల ఖాతాదారులు విస్మయం వ్యక్తం చేశారు. సాయంత్రం 4 గంటలు అయితే చాలు వెంటనే గేట్లు వేసే సిబ్బంది పనివేళల్లో ముఖ్యంగా మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల వరకు ఎక్కడకు వెళ్లారని ఖాతాదారులు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకులో ఆరుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, కానీ ఆ సమయంలో ఒక్కరూ కూడా లేరని దీంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చిందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు అటెండర్ ఖాతాదారులు బ్యాంకు లోనికి రానీకుండా సిబ్బంది లేరని, సిబ్బంది వచ్చిన తరువాత మాత్రమే లోపలికి రావాలని చెప్పడంతో ఖాతాదారులు బ్యాంకు సిబ్బంది ఎప్పుడు వస్తారో అని పడిగాపులు కాశామని, మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క పొలం పనులు ఉధృతంగా జరుగుతున్న ఈ రోజుల్లో బ్యాంకు సిబ్బంది ఈ విధంగా చేయటం ఏంటని, చివరికి వీరు ఎక్కడికి వెళ్లారో ఆరాతీస్తే ఏదో ఫంక్షన్‌కు వెళ్లారని సిబ్బంది చెప్పారని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ యువీ నారాయణరెడ్డి

కనిగిరిరూరల్: ఇంటర్, పది విద్యార్థులు పరీక్షల్లో మెళకువలు పాటించి నూరుశాతం ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని ఎంఈఓ యువీ నారాయణ రెడ్డి అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం పది, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, బోధన తీరు తదితర అంశాల గురించి వివరించారు. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. పదిలో నూరుశాతం ఫలితాల సాధనకు కృషి చేయాలని ప్రతి విద్యార్థికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, హాజరు పట్టీలను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు అందజేస్తున్న మెనూను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ హసీనా, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



నాగులవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో గుడ్లను పరిశీలిస్తున్న ఎంఈఓ

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని చింతపూడి ప్రాథమిక పాఠశాలను, సి.నాగులవరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను తనిఖీచేశారు. ఆయా పాఠశాలల్లో వంట ఏజెన్సీ మహిళలకు పలు సూచనలు చేశారు. గతంలో మాదిరి రాష్ట్రమంతా ఒకే మెనూ కాకుండా ప్రస్తుతం జోన్లవారీ మెనూ రూపొందించామని, నూతన మెనూను అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు, చిక్కీలను పరిశీలించారు. బరువు తక్కువ ఉన్న కోడిగుడ్లను తీసుకోవద్దని, వాటిని తిప్పి పంపాలని సూచించారు. నూతన మెనూపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. క్లస్టర్ హెచ్‌ఎం మందాకుమారి, విద్యార్థులు ఉన్నారు.

ఐపీఎస్ సునీల్‌కుమార్ సస్పెండ్ దారుణం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దళిత నాయకులు

సింగరాయకొండ: దళిత అధికారి ఐపీఎస్ సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయటం దారుణమని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, దళిత రైట్స్ ఫెడరేషన్, అంబేడ్కర్ ఇండియా మిషన్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సాయంత్రం నిరసన తెలియజేశారు. దళిత ఉద్యోగులను భయపెట్టి సస్పెండ్ చేయటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తుల్లిబిల్లి అశోక్‌బాబు, పులగర కృష్ణయ్య, ఆరేటి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని ప్రతిభ

కొండపి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని ఏపీఏఎంటీ మ్యాథమ్యాటిక్స్ ఒలంపియాడ్–2024లో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ 30న ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ మ్యాథమెటిక్స్ టీచర్స్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. టాలెంట్ టెస్టులో పి.కీర్తి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో సాధించింది. ఈ నెల 13న ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.